RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ ఆయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 130 పేజీలు - 08 మంగళవారం 07 ఏప్రిల్ 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

భూమి నుంచి రికార్డు దూరంలో

1970లో అపోలో 13 కంటే 2,500 కి.మీ అదనం

10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు




## తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

త్వరలో ముసాయిదాపై స్పందిస్తాం : ఇరాన్

హోర్ముజ్‌పై గుత్తాధిపత్య శకం ముగిసిందని స్పష్టీకరణ

ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి

తాజా భీకర దాడుల్లో 34 మందికి పైగా మరణం

అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరపం : ఇరాన్




## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

- పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 06:** రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మిగతా2లో...

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

- తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**తొలి అక్షరం/ఆదిలాబాద్,ఏప్రిల్ 06:** గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి మిగతా2లో...

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

ఆనాటి నేతలు...నేటి మోదీతో మరింత బలోపేతం

47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



**తొలి అక్షరం/అమరావతి,ఏప్రిల్ 06:** బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మిగతా2లో...



## ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

- అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,ఏప్రిల్ 06:** భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా మిగతా2లో...

## హామీలను అమలు చేసిన ఘనత మాది

- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం
- మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క



**తొలి అక్షరం/ఆదిలాబాద్,ఏప్రిల్ 06:** అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు మిగతా2లో...

## భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్




**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 06 :** భారతీయ యువత కేవలం ఉద్యోగాల కోసం వెతికేవారుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా మారి ఉద్యోగాలను సృష్టించేవారుగా ఎదగాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.భారత్ ఆర్థిక గమనం, కృత్రిమ మేధ, వ్యవస్థాపకత, మారుతున్న ఉద్యోగ రంగాలపై తన లోతైన విశ్లేషణలను విద్యార్థులతో పంచుకున్నారు. న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం ప్రత్యేక చర్చ గోష్టిలో కేటీఆర్ పాల్గొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలు, భారతదేశ ప్రగతి, నిరుద్యోగం, యువత, గెలుపు ఓటముల వంటి అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.గడిచిన దశాబ్ద కాలంలో భారత్ భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. 3జీ, 4జీ, 5జీ వంటి టెలికాం సాంకేతికతలను భారత్ ప్రపంచ దేశాల కంటే ముందుగానే అందిపుచ్చుకుందని గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు భారత్ ఒక కీలక దశలో ఉందని, ఇతర దేశాల అభివృద్ధి నమూనాలను యథాతథంగా కాపీ కొట్టే పరిస్థితి లేదని అన్నారు. సొంతంగా, వినూత్నంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.ఏఐ ముప్పు పొంచి ఉంది..ఏఐ ముప్పు పొంచి ఉందని, అప్రమత్తత అవసరమని కేటీఆర్ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెను మార్పులు తీసుకురాబోతోందని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ వల్ల రాబోయే రోజుల్లో మిలియన్ల కొద్దీ ఉద్యోగాలు ప్రభావితమవుతాయి. ఈ ముప్పు వాస్తవం. చాలా దగ్గరలో ఉంది. ఈ మార్పును తట్టుకోవ దానికి ప్రభుత్వాలు కానీ, సమాజం కానీ ఇంకా సిద్ధంగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విప్లవాన్ని తట్టుకోవాలంటే యువత నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. తాజాగా ఒరాకిల్ సంస్థ భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించిన అంశాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.హైదరాబాద్ తరహా ఇన్నోవేషన్ హబ్‌లు కావాలి..స్టార్టప్ వ్యవస్థ గురించి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఒక ఉదాహరణగా కేటీఆర్ చూపారు. మిగతా2లో...

## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు
- రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్
- పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు




# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



**తొలి అక్షరం/హైదరాబాద్,ఏప్రిల్ 06:** ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళాలో సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళాను నిర్వహించారు. ఈట్ రైట్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెంటర్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మి÷-లలెట్లతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలెట్స్‌తో తయారు చేసిన ఐస్ క్రీమ్, కాఫీ, తదితర పదార్థాలను మంత్రి రుచి చూసి, తయారీ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు, కాయగూరలు, మసాల దినుసులు, చిరుధాన్యాలు, టీ పౌడర్ , పప్పు దినుసుల్లో కల్తీని ఎలా గుర్తించాలో మిగతా2లో...



## తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

- 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు

**తొలి అక్షరం/చెన్నై,ఏప్రిల్ 06:** లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, మిగతా2లో...

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**తొలి అక్షరం/విజయవాడ,ఏప్రిల్ 06 :** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుక ల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్టాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనక డుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోం దన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకుల కు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

(మొదటి పేజీ తరువాయి)

భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్బంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇంక్యుబేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు, మెంటార్ల ప్రోత్సాహం వల్లనే హైదరాబాద్ నుంచి అనేక 'యూనికార్న్' సంస్థలు పుట్టుకొచ్చాయని వివరించారు. దేశంలో వ్యవస్థాపకత పెరగాలంటే కేవలం పథకాలు ఉంటే సరిపోదని, ఒక పటిష్టమైన 'ఎకో సిస్టమ్' అవసరమని అభిప్రాయపడ్డారు.భారతదేశంలో ఉన్న యువ జనాభా ఒక శక్తి అని, అయితే అదే సమయంలో అది ఒక సవాలు అని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే కేవలం అవకాశాలు కల్పిస్తే సరిపోదని, సరైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు.

పెద్దగా కలలు కనండి, చిన్న విజయాలకు ఎప్పుడూ సంతృప్తి చెందకండని పిలుపు నిచ్చారు. జీవితంలో ఓటమికి భయపడవలసిన అవసరం లేదని, వైఫల్యం అనేది గెలుపు దిశగా సాగి ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని స్ఫూర్తిని నింపారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధైర్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు .ఈ కార్యక్రమంలో కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు, మేధావులు, ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్ పలు అంశాల పైన చెప్పిన అభిప్రాయాలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

తెలుపుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల్లో జరిగిన కల్తీని ఎలా గుర్తించాలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మంత్రికి వివరించారు. ఆయా పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్ప పువ్వుతో లడ్డులు, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి.. సక్సెస్‌ఫుల్‌గా బిజినెస్ రన్ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. స్టాళ్ల సందర్శన అనంతరం జరిగిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు మంత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు హైజీన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ - న్యూట్రీషియన్ ఫుడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, మనం తింటున్న ఆహార నాణ్యత గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. 'మంచి ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకోవడానికి ఈట్ రైట్ మేళా వంటి కార్యక్రమాలు ఇందుకు ఎంతో దోహదపడుతాయి. ఆరోగ్యం బాగున్నప్పుడే, జీవితం ఆనందంగా ఉంటుందన్న విషయాన్ని బిజీ లైఫ్‌లో పడి మనం మర్చిపోతున్నాం. డబ్బు, ఉద్యోగం, సౌకర్యాలు అన్నీ ఉన్నా? ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదు. ఇటీవలి కాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోయాయి. బయట ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగింది. దీంతో పాటు, శారీరక శ్రమ, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. రోజూ కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం చాలా అవసరం. వాకింగ్, యోగా, గేమ్స్... ఏదైనా ఒకటి మన నిత్య జీవితంలో భాగం కావాలి. శరీరం కదిలితేనే ఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమైనది.ఈ పరిస్థితుల్లో, 'ఈట్ రైట్' అనే భావన చాలా కీలకం. మనము తినే ఆహారమే, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి, ఏం తినాలో, ఎక్కడ తినాలో ప్రజలు తెలుసుకోవాలి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినడం మంచిది. ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలి, మనసుకు ప్రశాంతత కలిగించే జీవనశైలిని అలవరచుకోవాలి. ఆహార కల్తీ జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే, వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. తక్షణమే కఠిన చర్యలు తీసుకునే బాధ్యత మాది.' అని మంత్రి ప్రజలకు సూచించారు.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

(మొదటి పేజీ తరువాయి)



పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

# జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**తొలి అక్షరం/న్యూయార్క్ ,ఏప్రిల్ 06:**అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

# తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

**తొలి అక్షరం/టెహ్రాన్,ఏప్రిల్ 06:**పశ్చిమాసియాలో దాదాపు నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించేందుకు ఇరాన్ సుముఖంగా లేదని ఓ సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని ఆయన సోమవారం వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హార్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. కాగా రెండంచెల ముసాయిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరుపక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరగవని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె స్పష్టం చేశారు. ఓ పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయని, వాటిని ఇప్పటికే మధ్యవర్తుల ద్వారా తెలియజేశామని అన్నారు. అయితే ఇవి మితిమీరి ఉన్నాయంటూ అమెరికా పంపిన 15పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ఇప్పటికే తిరస్కరించిందని తెలిపారు. చట్టబద్ధమైన తమ డిమాండ్లను స్పష్టంగా వివరించడంలో ఇరాన్ వెనుకాడబోదని అన్నారు. ఆ విధంగా చేయడాన్ని రాజీ సంకేతం గా భాష్యం చెప్పరాదని అన్నారు. దానికన్నా తమ వైఖరులను నిర్వచించడంలో తమ విశ్వాసాన్ని వ్యక్తీకరించడంగా చూడాలని తెలిపారు. త్వరలో మా స్పందనలు తెలియపరుస్తాం, వివరాలు వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. కాల్పుల విర మణ ప్రణాళికపై ఇరాన్ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా చెప్పారు. కాగా అమెరికా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.పాకిస్తాన్‌విదేశాంగకార్యాలయ ప్రతినిధితాహిర్ అంద్రబి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

# రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

# ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

# తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధి కారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు. నాటి నుంచి ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

# అమ్మాపురంలో ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- భారీ బైక్ ర్యాలీతో హోరెత్తిన వీధులు
- పార్టీ జెండాను ఆవిష్కరించిన లేగా రామ్మోహన్ రెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** భారతీయ జనతా పార్టీ బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను తొర్రూరు మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు గట్టు రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో భాగంగా, స్థానిక శివాజీ చౌక్ నుండి బస్టాండ్ సెంటర్ వరకు పార్టీ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర పూర్వ కార్యవర్గ సభ్యుడు లేగా రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎందరో కార్యకర్తలు, నాయకుల బలిదానాల పునాదులపై నిర్మితమైన బీజేపీ, నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించడం గర్వకారణమని అన్నారు. ఏకాత్మతా మానవతా వాదం, అంత్యోదయ సిద్ధాంతాలతో దేశాభివృద్ధే మంత్రంగా పార్టీ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. వాజ్‌పాయ్, అద్వానీల మార్గదర్శకత్వంలో మొదలైన ప్రస్థానం. నేడు నరేంద్ర మోదీ, అమిత్ షాల సమర్థ నాయకత్వంలో విజయవంతంగా కొనసాగుతోందని, రాబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లోనూ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లె కుమార్, గ్రామ ఉప సర్పంచ్ సిరిపాటి విశాల్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గుండా సురేష్, కన్వీనర్ ఊర కేశవ్, వార్డు మెంబర్లు గంధం యాకమ్మ, పురాణపు బాబా మహేష్, నాయకులు సిరిపాటి స్వామి, కడెం పాండు, కిన్నెర రాజ్ కుమార్, ఆకాష్, గట్టు సుమలత తదితరులు పాల్గొన్నారు.

# నాచారంలో చలివేంద్రం ప్రారంభం

- రాగిరి జ్యోతి మోహన్ రెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** నాచారం హెచ్‌ఎంటి నగర్ ప్రధాన రహదారి బస్సు కూడలి వద్ద రాగిరి జ్యోతి మోహన్ రెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. సంస్థ ఛైర్మన్ రాగిరి మోహన్ రెడ్డి, అధ్యక్షురాలు జ్యోతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి పవన్ కాంత్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా భాజపా మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డా. మేకల శిల్పారెడ్డి, బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రవి నాయక్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించి నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో తాడూరి శ్రీనివాస్, కే. నవీన్ కుమార్, మల్లెల నర్సింగ్ రావు, బెక్కరి రవీందర్ రెడ్డి, కాటిపల్లి రవీందర్ రెడ్డి, పంపాలా అనిత పద్మారెడ్డి, అభిషేక్ గౌడ్, విరూపాక్ష నవీన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, ఉదయ్ కిరణ్ రెడ్డి, పాదం వెంకటేష్, రమేష్ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, బాలు, భాస్కర్, కిషోర్, వెంకటేశ్వర్లు, నరసింహారెడ్డి, హరినాథ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పలువురు స్థానికులు, నాయకులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అక్రమ ఇసుక డంపులపై రెవెన్యూ పంజా

- గుర్తురు శివారులో 50 ట్రాక్టర్ల ఇసుక సీజ్
- అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు తొర్రూర్ తహసిల్దార్ గడీల శ్రీనివాస్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినా, నిలువ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని తొర్రూరు తహసిల్దార్ గడీల శ్రీనివాస్ హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలోని గుర్తురు గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన భారీ ఇసుక డంపును సోమవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గుర్తురు గ్రామ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు భారీగా ఇసుకను తరలించి డంపింగ్ చేస్తున్నట్లు స్థానిక రెవెన్యూ అధికారులకు పక్కా సమాచారం అందింది. తొర్రూర్ తహసిల్దార్ జి శ్రీనివాస్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ మహమ్మద్ నజీముద్దీన్ తన సిబ్బందితో కలిసి నిల్వ ఉంచిన స్థావరాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు 40 నుండి 50 ట్రాక్టర్ల వరకు ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించి, దానిని వెంటనే సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ గడీల శ్రీనివాస్ చరవాణి ద్వారా స్పందిస్తూ. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను నిల్వ చేసే వారిపై నిఘా ఉంచామని తెలిపారు. సీజ్ చేసిన ఇసుకపై ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని, అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం







- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తొర్రూరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 135 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన రూ. 1,35,15,666 లక్షల విలువచేసే చెక్కులను అందజేశారు. పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. పేదింటి ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మి పథకం అండగా నిలుస్తుందన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం వినూత్నమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని గుర్తు చేశారు. పార్టీల కచ్చితంగా సంక్షేమ పథకాలు పేదలకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, మహిళ కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షురాలు పింగళి ఉష, కౌన్సిలర్లు ఆయా గ్రామాల సర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

# కస్నా తండా పేరును సీత్యా తండాగా మార్చాలి ఎమ్మెల్యేకు గ్రామస్థుల వినతి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** మండలంలోని కంటాయపాలెం గ్రామ శివారులో ఉన్న కస్నా తండా పేరును పునరుద్ధరించి, తిరిగి సీత్యా తండాగా నామకరణం చేయాలని కోరుతూ తండా వాసులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తండా ప్రతినిధులు మాట్లాడుతూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సుమారు వంద సంవత్సరాల క్రితం సీత్యా నాయక్ అనే వ్యక్తి మొట్టమొదటిగా కంటాయపాలెం శివారులో స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. ఆయన పేరు మీదుగానే గతంలో ఈ తండాను పిలిచేవారని, కానీ కాలక్రమేణా కొందరు వ్యక్తులు కావాలని పేరును మార్చారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తండా ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన సీత్యా నాయక్ జ్ఞాపకార్థం, ఆయన పేరునే తిరిగి అధికారికంగా ప్రకటించాలని వారు ఎమ్మెల్యేను కోరారు. ఈ విన్నపం అందజేసిన వారిలో కంటయపాలెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోకాటి వెంకన్న, తండా వాసులు బానోత్ మురళి, బానోత్ దేవేందర్, సోమన్న తదితరులు ఉన్నారు. ఈ అంశంపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నలు విక్రయించాలి

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) ఏప్రిల్ 6:** ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నలు విక్రయించాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పేర్కొన్నారు. పిఎసిఎస్ ఆధ్వర్యంలో తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం స్థానిక ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... దళారులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్నలు విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రభుత్వం మక్కలకు క్వింటాల్ కు రూ. 2400 మద్దతు ధర అందిస్తుందని, 14 శాతం తేమతో మొక్కజొన్నలను కేంద్రాలకు తీసుకువచ్చి వారం రోజుల్లో డబ్బులు పొందాలని కోరారు. కేంద్రానికి మొక్కజొన్నలు తీసుకువచ్చే రైతులు పంట సాగు ధ్రువీకరణ పత్రం, పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్ లు వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రం నుంచి మద్దతు లేకపోయినప్పటికీ, రైతులకు సరసమైన ధరలు అందేలా చూస్తూ, రూ. 2,500 కోట్ల విలువైన మొక్కజొన్నను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ గుగులోత్ భట్టు నాయక్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, కాంగ్రెస్ మహిళా బ్లాక్ అధ్యక్షురాలు పింగిలి ఉష, డైరెక్టర్లు, ఏవో రామనర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దుకుందాం: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**మూడు గ్రామాల్లో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు - లబ్ధిదారులకు బట్టల పంపిణీ**

**వీర్లపల్లి శంకర్ తోనే అభివృద్ధి సాధ్యం: సర్పంచ్ చందునాయక్**





**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 06:** నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని, రాజకీయాలకు అతీతంగా అందరం కలిసిమెలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మండల పరిధిలోని భీమారం, ఉప్పరిగడ్డ, చించోడ్ గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా సుమారు కోట్లాది రూపాయల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు.

**మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి** గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పలు కీలక పనులను ప్రారంభించారు. భీమారం, ఉప్పరిగడ్డ, గ్రామాల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అదేవిధంగా చించొడ్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అంతకుముందు చించొడ్ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యతతో కూడిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**సొంతింటి లబ్ధిదారుల ఇంట సంబరాలు** భీమారం, చించోడు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులు ఈరోజు సామూహిక గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారుల కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, వారికి నూతన వస్త్రాలను బహూకరించి శుభాకాంక్షలు తెలిపారు. పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంటే చూడటం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

**ఉప్పరిగడ్డలో జనసంద్రం - సర్పంచ్ ప్రశంసలు** ఉప్పరిగడ్డ గ్రామంలో సర్పంచ్ చందునాయక్ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు అయ్యవారిపల్లి, మక్త, జయరాం తండా గ్రామాల నుండి ప్రజలు, మహిళలు, యువకులు పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సర్పంచ్ చందునాయక్ మాట్లాడుతూ.. “వీర్లపల్లి శంకర్ అన్న నాయకత్వంలో నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. ఆయనతోనే మన గ్రామాల అభివృద్ధి సాధ్యం“ అని స్పష్టం చేశారు. ముఖ్యంగా తమ గ్రామానికి ఎమ్మెల్యే 30 లక్షల సిసి రోడ్ల నిర్మాణాల పనులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణానికి మరో 20 లక్షల రూపాయల నిధులు కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా గ్రామంలో 18 ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని, మరో 20 ఇల్లు మంజూరు చేయడానికి ఎమ్మెల్యే హామీ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని, తద్వారా పేద ప్రజల ఆకాంక్ష నెరవేరుతుందన్నారు. ఇలాంటి ఎమ్మెల్యే మన నియోజకవర్గానికి ఉండడం అభినందనీయమన్నారు. ఈ పర్యటనలో ఫరక్ నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, అయ్యవారిపల్లి గోపాల్ నాయక్, చించోడు సర్పంచ్ శ్రీనివాస్, చౌలపల్లి సర్పంచ్ జంగయ్య, ఉప్పరిగడ్డ డిప్యూటీ సర్పంచ్ శ్రీలత తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ గజేంద్ర నాయక్, బి తిరుపతయ్య, భోజ్య నాయక్, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు







**తొలి అక్షరం /మేడిపల్లి/ ఏప్రిల్06:** మేడ్చల్ జిల్లా బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని చెంగిచెర్ల లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈస్ట్ జోన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొన్న పార్టీ నాయకులు మహేష్, శ్రీనివాస్ గుప్తా తదితరులు పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. 46 సంవత్సరాల క్రితం ఆవిర్భవించిన బిజెపి దినదిన అభివృద్ధి చెందుతూ, ప్రజల ఆదరణను పొందుతూ తిరుగులేని శక్తిగా ఎదిగిందని నాయకులు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం విశ్వ గురువుగా పిలువబడుతుందని, ఆయన మార్గదర్శకంలో ప్రతి నాయకుడు కార్యకర్త దేశం కోసం ధర్మం కోసం పనిచేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సాయి రెసిడెన్సి చౌరస్తా వద్ద బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు.

## బాల్య వివాహాల నివారణకై అవగాహన కలిగి ఉండాలి: బోడుప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ




**తొలి అక్షరం /మేడిపల్లి /ఏప్రిల్ 06:** బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన కల్పించాలని డిప్యూటీ కమిషనర్ శైలజ అన్నారు. సోమవారం మేడిపల్లిలో నిర్వహించిన అవాగాల కార్యక్రమానికి నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బాలకృష్ణ హాజరై మాట్లాడుతూ...అమ్మాయిలు 18 సంవత్సరాలు వచ్చాక మాత్రమే వివాహం చేసుకోవాలన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల వారికి పుట్టే పిల్లల్లో జన్యు పరమైన సమస్యలు ఉత్పన్నమౌతాయన్నారు. బాలికలకు యుక్త వయస్సు వచ్చిన వెంటనే వివాహాలు చేసి తల్లిదండ్రులు చేతులు దులుపుకుంటున్నట్లు తెలిపారు. స్పందన సేవ సొసైటీ సీఈవో శోభా రెడ్డి మాట్లాడుతూ...మానవుడు అంతరిక్షంలో నివసించే దిశగా అడుగులు పడుతున్న ఈ సాంకేతిక కాలంలో కూడా బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయలేకపోవడం చాలా బాధాకరం అని ప్రతి ఒక్కరు బాల్యవివాహాల చట్టంపై అవగాహన కలిగి ఉండి బాల్యవివాహాలను నిర్మూలించాలన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ వెంకటేష్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు

## నివాళులు అర్పించిన టిఆర్ఎస్ నాయకులు



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన ఆవుల. స్వామి మరియు చల్లమల్ల జగన్నాధం లు అనారోగ్యంతో మరణించగా వారి మృతదేహాల వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించిన బి ఆర్ స్ నాయకులు...ఈ కార్యక్రమంలో మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవుల భగవంతం, వార్డు మెంబర్ చినపాక రమేష్, బి ఆర్ ఎస్ నాయకులు ఆవుల నరేందర్, చిప్పలపల్లి రవీందర్,జెట్టి శివప్రసాద్,,ఆవుల. లక్ష్మి నారాయణ, జెట్టి యాదయ్య, చల్లమల్ల. ధనుంజయ,తదితరులు పాల్గొన్నారు


## ఆర్థిక సహాయం



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** సల్ల చిన్న రామచంద్రం అనారోగ్యంతో చనిపోవడం పట్ల ఆయన మృతదేహాన్ని పూలమాలవేసి నివాళులర్పించిన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి చెపుతూ 5000 రూపాయలు ఆర్థిక సాయం చేసినారు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ ఉప సర్పంచ్ మోటి రమేష్ సీనియర్ నాయకులు జినుకుల ప్రభాకర్ ఎండి నాసర్ బొడ్డు సురేందర్రావు జిల్లా వెంకటేశం కోట సుధాకర్ బుర్రి రవీందర్ ఊరే శేఖర్ వార్డు సభ్యులు మోటి రామస్వామి గొరిగే శేఖర్ ఎండి రిజ్వాన్ ఘట్కే నవీన్ తరిదారులు పాల్గొన్నారు పాల్గొన్నారు

## ఖరామన్నపేట నియోజకవర్గం ఏర్పాటు చేయాలి

**● రాపోలు నరసింహ టిడిపి రాష్ట్ర మాజీ కార్యదర్శి**



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** అసెంబ్లీ నియోజకవర్గాల పెంపులో భాగంగా రామన్నపేట ను అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా అన్నారు.... రామన్నపేటలో ప్రభుత్వాసుపత్రి... కోర్టు... డివిజన్ ఆఫీసులు... అన్ని కార్యాలయాలు ఉండి గతంలో కూడా నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రామన్నపేట ను ప్రస్తుతం పెంచే నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు...... రామన్నపేట ను అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించేదాకా అందరు కూడా ముక్తకంఠంతో ఏకతాటిపై ఉండి నియోజకవర్గం సాధించుకునే విధంగా భాగస్వాములు కావాలని అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో రామన్నపేట మండల పార్టీ అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్ చేనేత నాయకులు గ్సిక చక్రపాణి తెలుగుదేశం పార్టీ రామన్నపేట బి. సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, గజం నరసింహా తదితరులు పాల్గొన్నారు

## సిరిపురంలో అక్రమంగా ఏర్పాటుచేసిన సిరి మెటల్ ప్రొడక్ట్స్‌ను తక్షణం రద్దుచేసి బాధిత రైతాంగాన్ని కాపాడాలని రామన్నపేట తహసిల్దార్ కార్యాలయం ముందు రైతుల నిరసన





**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** "చట్టపరమైన అనుమతులు లేకుండా, చట్ట విరుద్ధంగా ఏర్పాటుచేసిన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని "సిరి మెటల్ ప్రొడక్ట్స్" పేరుతో ఏర్పాటు చేసిన కంకర క్రషర్ ను వెంటనే రద్దుచేసి వందలాదిమంది రైతాంగాన్ని ఆదుకోవాలని" ప్రజా పోరాట సమితి (పిఆర్పిఎస్ )రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి అఖిలపక్షాల నాయకులైన బిజెపి నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, సిపిఎం నాయకులు బడుగు రమేష్, బిఆర్ఎస్ నాయకులు పున్న వెంకటేశం, పి అర్ పి ఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్ గోపాల్, విలేజ్ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు కిషోర్, బాధిత రైతు నాయకులు కందుల మల్లారెడ్డి తదితరులు రైతు ముట్టడిలో పాల్గొని మాట్లాడుతూ కోరారు. ఈరోజు అఖిలపక్షాల ఆధ్వర్యంలో రామన్నపేట తహసిల్దార్ కార్యాలయం ముందు సిరిపురం గ్రామంలో "సిరి మెటల్ ప్రొడక్ట్స్" వల్ల వచ్చే దుమ్ము, ధూళి పంట పొలాలకు నష్టం కలుగుతున్నందున బాధిత రైతులతో కలిసి అన్ని రాజకీయ పార్టీలు, అన్ని రైతు సంఘాలు కలిసి ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాలో పాల్గొన్న అఖిలపక్షాల రైతు నాయకులు పార్టీ నాయకులు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పబ్లిక్ హియరింగ్ ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా కంకర క్రషర్ ను ఏర్పాటు చేశారని, దీనివల్ల 50 రైతు కుటుంబాలు 300 ఎకరాల భూముల్లో పంట పొలాలకు తీవ్రంగా నష్టం కలిగి ఇబ్బందులు కలుగుతున్న నేపథ్యంలో తక్షణం స్థానిక తహసిల్దార్ కంకర క్రషర్ ను రద్దు చేసేదాకా పోరాటాన్ని కొనసాగిస్తామని" మూకుమ్మడిగా తెలిపారు . ఈ ధర్నాలో ప్రజా పోరాట సమితి జిల్లా నాయకులు గాదె ఎల్లేష్, గ్రామ ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్, బిజెపి గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ, సిపిఎం నాయకులు బల్గూరి అంజయ్య, రైతు బాధితులు దయ్యాల మల్లయ్య, దయ్యాల శ్రీశైలం, బల్గూరి నరసింహ, సంగిశెట్టి మహేష్, బల్గురు వెంకటేశం, కోనూరు యాదగిరి గౌడ్, బీసుల బీరయ్య, బండారు నరసింహ, కందుల యాదగిరి రెడ్డి, కందుల బాసిరెడ్డి, కట్ట శ్రీధర్ రెడ్డి, బిట్ల సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## పైపులైన్లలో తిష్టవేసిన చెట్ల వేర్లు

**● తాగునీటి సరఫరాకు ఆటంకం**

**- మునిగలవీడుపాము కాదు.. వేర్ల 'బంధం'! ● పైపులైన్లలో కొండచిలువలా అల్లుకుపోయిన చెట్ల వేర్లు ● మునిగలవీడులో నిలిచిపోయిన నీటి సరఫరా ● నూతన పైపులైన్ వేయాలని బీజేపీ జిల్లా నేత నల్లాని పాపారావు**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 6:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మునిగలవీడు గ్రామంలో తాగునీటి పైపులైన్లు వింత ఆకారాన్ని సంతరించుకున్నాయి. నీటి సరఫరా కోసం భూగర్భంలో వేసిన పైపుల నుంచి నీరు రావాల్సింది పోయి.. కొండచిలువలను తలపించేలా చెట్ల వేర్లు బయటపడుతున్నాయి. మూడు దశాబ్దాల క్రితం వేసిన ఈ పైపులైన్లు పూర్తిగా శిథిలం కావడంతో, లీకేజీల ద్వారా లోపలికి చొరబడిన వేర్లు పైపు మొత్తం అల్లుకుపోయి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. **కొండచిలువను తలపిస్తున్న వేర్లు:** గ్రామంలోని ఆకారం వెంకటేశ్వర్లు, మారబోయిన శ్రీనివాస్ ఇళ్ల ముందు సోమవారం పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా విస్తుపోయే దృశ్యం కనిపించింది. పైపు లోపల వేర్లు ఎంతగా అల్లుకుపోయాయంటే.. పైపును కోసి బయటకు తీసినప్పుడు అవి భారీ కొండచిలువ పాము ఆకారంలో దర్శనమిచ్చాయి. కొన్ని మీటర్ల పొడవునా పెరిగిన ఈ వేర్ల సమూహం కారణంగా గ్రామస్థులకు చుక్క నీరు అందడం లేదు. పలుమార్లు అధికారులు తాత్కాలికంగా వేర్లను తొలగించి నీటిని పునరుద్ధరిస్తున్నా, పదేపదే సమస్య పునరావృతమవుతోంది. **కొత్త పైపులైనే పరిష్కారం - నల్లాని పాపారావు:** గ్రామ ప్రజల దాహార్తిని తీర్చే రక్షిత మంచినీటి బావి నుంచి వచ్చే సరఫరాకు ఈ పాత పైపులే శాపంగా మారాయని వార్డు సభ్యులు, బీజేపీ జిల్లా నేత నల్లాని పాపారావు అన్నారు. సుమారు 20 నుంచి 30 ఏళ్ల క్రితం నాటి సిమెంట్, పీవీసీ పైపులు కావడంతో అవి పూర్తిగా కాలం చెల్లిపోయాయని, ఫలితంగా విపరీతంగా లీకేజీలు అవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. లీకేజీల ద్వారా చెట్ల వేర్లు పైపుల్లోకి ప్రవేశించి అడ్డంగా మారుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కొత్త పైపులైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## ముదివయసులో 'మత్తు' దందా.. పకీరుతండాలో గంజాయి కలకలం!

**పక్కా సమాచారంతో పోలీసుల మెరుపు దాడి: 4.8 కిలోల గంజాయి సీజ్**

**అమ్మకానికి సిద్ధంగా ఉండగా పట్టుకున్న నర్సింహులపేట పోలీసులు**

**రూ. 2.40 లక్షల విలువైన సరుకు స్వాధీనం**

**- 76 ఏళ్ల వృద్ధుడి అరెస్ట్**

**యువతను చిత్తు చేస్తున్న మత్తు రక్కసిపై పోలీసుల ఉక్కుపాదం**



**తొలి అక్షరం/నర్సింహులపేట, ఏప్రిల్ 6:** సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన వృద్ధాప్యం.. అక్రమ సంపాదనకు అలవాటుపడి మత్తు మార్గంలో మళ్లిన ఘటన మహబూబాబాద్ జిల్లాలో వెలుగుచూసింది. నర్సింహులపేట మండలం పకీరతండాలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయి విక్రయాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. సోమవారం సాయంత్రం నిర్వహించిన మెరుపు దాడుల్లో భారీగా గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒకరిని కటకటాల్లోకి నెట్టారు. **అమ్మకానికి సిద్ధమవుతుండగా..** తొర్రూరు డివిజన్ పరిధిలో గంజాయి సరఫరా అవుతున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు నిఘా పెంచారు. ఈ క్రమంలో పకీరతండ వద్ద ఎస్సై ఎం. సురేష్ బృందం తనిఖీలు చేపట్టగా, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 4.8 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ. 2,40,000 ఉంటుందని అంచనా. నిందితుడు అదే గ్రామానికి చెందిన 76 ఏళ్ల వ్యక్తి కావడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. **ఎక్కడి నుంచి వస్తోంది?** ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు గంజాయిని దిగుమతి చేసుకుని, ఇక్కడి యువతను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ అక్రమ రవాణా వెనుక ఇంకా ఎవరెవరి హస్తం ఉందనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. **వేటు తప్పదు!** "మత్తు పదార్థాల విక్రయాలతో యువత భవిష్యత్తును నాశనం చేసే వారిని ఉపేక్షించేది లేదు" అని తొర్రూరు సి.ఐ హెచ్చరించారు. గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో చాకచక్యంగా వ్యవహరించి గంజాయిని పట్టుకున్న పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

## పెన్నా నదిలో ఇసుక మాఫియా బీభత్సం

**అధికారులు చర్యలు తీసుకోవాలి,రైతుల ఆవేదన**

**తొలి అక్షరం/సిద్ధవటం ఏప్రిల్ 06:-** పెన్నా నది పరివాహక ప్రాంతాల్లో అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోంది.ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి,ఇసుక కేటుగాళ్లు రాత్రి వేళల్లో యంత్రాలతో ఇసుకను తరలిస్తూ బరితెగిస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని లింగంపల్లి, కడపాయపల్లె, మాచుపల్లి గ్రామాల్లోని పంట పొలాల సమీపంలో ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు జరుపుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఒక్కో ట్రాక్టర్ ఇసుకను కడపకు తరలించి రూ. 3 వేలకు విక్రయిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. అక్రమ రవాణాపై మండల తహసీల్దార్ ఆకుల తిరుమల బాబు స్పందిస్తూ.. ఇసుక తరలింపు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇప్పటికే లింగంపల్లి, మాచుపల్లి ప్రాంతాల్లో రవాణాకు వీలు లేకుండా రహదారులను తొలగించామని, అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



# సన్మాన కార్యక్రమం






**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో తుమ్మలగూడెం సర్పంచ్ విక్రమ్ కి ఉప సర్పంచ్ పోలిపాక జయసుధకి, నిధాన్ పెల్లి సర్పంచ్ నారపాక మాధవి కి ఉపసర్పంచ్ కొండ అండాలు కి, ఇతర వార్డు సభ్యులకు సన్మానం కార్యక్రమంనియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగినది రామన్నపేట నియోజకవర్గం సాధించడమే ముఖ్య ఏజెండాగా చేస్తున్న కార్యక్రమాలలో భాగంగా ప్రజాప్రతినిధులను నియోజవర్గం సాధించడంలో భాగస్వామ్యం చేయడానికి ప్రస్తుత ప్రజా ప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులను ప్రజలను ఏకం చేయడానికి ఈరోజు ఇంద్రపాల నగరం సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ కు, ఉప సర్పంచ్ పోలిపాక జయసుధ కి నిధాన్ పల్లి సర్పంచ్ నారపాక మాధవి యాదయ్య కి, ఉప సర్పంచ్ కొండా అండాలుకి ఇతర వార్డు సభ్యులకు సన్మానం చేసి ఎర్ర రమేష్ గౌడ్ మాట్లాడుతూ రామన్నపేట ను తిరిగి నియోజకవర్గంగా సాధించుకొనుటకు మనకు వచ్చిన అవకాశాన్ని అందరం ఏకమై సాధించుకుందామని నియోజకవర్గం సాధించుటకు జరిగే వివిధ కార్యక్రమాలలో అందరం పాల్గొని విజయవంతం చేయాలని తద్వారానే మన నియోజకవర్గ ఆకాంక్ష ప్రభుత్వాలకు, నాయకులకు అందరికీ అర్థమై మన ఆకాంక్ష నెరవేరే అవకాశం ఉంటుందని వారు తెలియజేశారు. దానికి సర్పంచి విక్రమ్ మాధవి స్పందించి, పోయిన మన నియోజకవర్గాన్ని మనమందరం కలిసి సాధించుకుందామని సాధన సమితి చేసే ప్రతి ఒక్క కార్యక్రమంలో మేము భాగస్వామ్యం అవుతూ మా వంతు పాత్ర చేస్తామని తెలిపారని అన్నారు... సన్మాన కార్యక్రమంలో నల్ల నరేందర్, గడ్డం యాదగిరి ,డాక్టర్ నకిరేకంటి అశోక్, ఎండి ఫజల్, జెట్టి శివప్రసాద్, నకిరెకంటి నరేష్, రవీందర్,ఆవుల నరేందర్,ఎమ్డి ఇమామ్ మీర్ ఖాజా అలీ గ్రామస్తులు పాల్గొన్నారు..

# పదివేల ఆర్థిక సహాయం అందించిన కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నీర్నంల





**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:**రామన్నపేట మండలం నీర్నంల గ్రామంలో చల్ల మల్ల జగన్నాథం అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించినారు. అనంతరం గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఆవుల స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించినారు . ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ మాజీ ఉపసర్పంచ్ చల్లా అనిత సత్య ప్రకాష్ నాయకులు నోముల చిరంజీవి ఆవుల క్రాంతి కుమార్ సుర్వి. అశోక్ చిప్పలపల్లి. జితేందర్ రుద్ర గణేష్ తదితరులు పాల్గొన్నారు

# రామన్నపేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ 46 వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం




**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** రామన్నపేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ కన్నె కంటి వెంకటేశ్వరాచారి మాట్లాడుతు శ్యామా ప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై నిర్మితమైదీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతావాదానికి కట్టుబడి పంక్తిలో చివరి వ్యక్తికి తొలి ప్రయోజనం చేకూరాలన్న అంత్యోదయ స్ఫూర్తితో సబ్ కా సాద్,సబ్ కా వికాస్,సబ్ కా విశ్వాస్,సబ్ కా ప్రయాస్ నినాదమే విధానంగా అటల్ జి అద్వానీ జి తదితర అగ్రనేతల మార్గదర్శనంతో భారతప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భరతమాత కీర్తి శిఖరాలను దిగంతాలకు వ్యాప్తి చేసే యజ్ఞంలో భాగమైన బిజెపి కార్యకర్తలకు,అభిమానులు, మద్దతుదారుకుభారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మదూరి ప్రభాకర్ రావు కట్కూరి బిక్షపతి కొమ్ము యాదయ్య కూనూరు సుధాకర్ ఏలూరు రవి యాదసు లక్ష్మణ్ గుండాల అంజయ్య యాదాసు లక్ష్మణ్ కొడారి వెంకటేష్ యాదవ్ గుంటోజు కృష్ణమాచారి అక్కినపల్లి సైదులు నడిగోటి సైదులు మందడి శ్రీధర్ రెడ్డి శుభకోటి శశి కృష్ణమాచారి కర్నాటి నరేష్ వడ్డేపల్లి అంబదాస్ దావునూరి గురిగి బీరప్ప మోటె బీరప్ప గొరిగే బాలకృష్ణ అజయ్ కానుకుర్తి అంజయ్య వడ్డేపల్లి అంబదాస్ ఏరువా సాయి కట్కూరి అరవింద్ కన్నెగంటి వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు

# పెద్దవంగరలో ఘనంగా భాజపా 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**తొలి అక్షరం/పెద్దవంగర ఏప్రిల్ 6:** మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు కట్టోజు భాస్కరాచారి పార్టీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పార్లమెంటులో కేవలం రెండు సీట్లు ఉన్న తరుణంలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ భాజపాను హేళన చేశారని, దానికి సమాధానంగా అటల్ బిహారీ వాజ్పేయి గారు చెప్పినట్లుగానే నేడు బీజేపీ ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని కొనియాడారు. బీజేపీ కుటుంబ పార్టీ కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా నడిచే పార్టీ అని, రానున్న రోజుల్లో దేశంతో పాటు రాష్ట్రంలోనూ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్, జిల్లా నాయకులు తలారి సోమన్న, మండల ఉపాధ్యక్షులు ఆనంద్, కార్యదర్శి పగిడిపల రాజు, నాయకులు హరీష్, బాలు, శేఖర్, సాగర్, మున్నా తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటాం: మండల పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్



**తొలి అక్షరం/కొడకండ్ల ఏప్రిల్ 6:** కొడకండ్ల మండలంలోని ప్రమాదవశాత్తూ గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామేశ్వరం గ్రామ పంచాయతీ 7వ వార్డు సభ్యులు జాటోతు లక్ష్మణ్ నాయక్ ని కొడకండ్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ సోమవారం పరామర్శించారు. తాడిచెట్టు పైనుండి ప్రమాదవశాత్తూ కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడిన లక్ష్మణ్ నాయక్ ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలిసిన వెంటనే స్పందించిన సురేష్ నాయక్ ఆసుపత్రికి చేరుకుని, బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి, బాధితుడికి ఎటువంటి లోటు లేకుండా మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా సురేష్ నాయక్ గారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సహకారంతో బాధితుడికి ప్రభుత్వం తరఫున అందాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తాం. కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది.ధైర్యంగా ఉండాలని లక్ష్మణ్ నాయక్ కుటుంబ సభ్యులకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు రాములు గారు, నాయక్ గారు మరియు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎర్రి లింగారెడ్డి నియామకం


- **డిసిసి ఉమా మురళి నాయక్ ప్రతిపాదన**
- **పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్ ఉత్తర్వులు జారీ**



**తొలి అక్షరం/నర్సింహులపేట , ఏప్రిల్ 6 :**మహబూబాబాద్ జిల్లా,నర్సింహులపేట మండలం పడమటిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు ఎర్రి లింగారెడ్డి ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియమిస్తూ తెలంగాణ పీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి, మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు శ్రీమతి డా. ఉమా మురళీ నాయక్ ప్రతిపాదన మేరకు ఈ నియామకం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎర్రి లింగారెడ్డి మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్ , జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు డా. ఉమా మురళీ నాయక్ , నర్సింహులపేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జినుకల రమేష్ , పడమటి గూడెం గ్రామ సర్పంచ్ జక్కుల ఉప్పలయ్య మరియు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులకు,కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇకపై పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా మేకల రవీందర్

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మండల అధ్యక్షుడిగా నియమితులైన మేకల రవీందర్ (మైకల్) వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కి రవీందర్ కృతజ్ఞతలు తెలియజేశారు. సేవాదళ్ ద్వారా పార్టీ బలోపేతానికి, కార్యకర్తల ఐక్యతకు కృషి చేయాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు.



# మల్లేష్ కుటుంబానికి ఆర్థిక సాయం



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన మాంద్ర మల్లేష్ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందన్న విషయం తెలుసుకున్న సిరిపురం జడ్పీహెచ్ఎస్ 1996-1997 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. స్నేహితుడి కుటుంబానికి చేయూతనివ్వాలని నిర్ణయించి సోమవారం రూ.1లక్ష రూపాయల నగదు సేకరించి మల్లేష్ ఇద్దరు కుమార్తెల పేరుమీద ఫిక్స్ డిపాజిట్ చేసి అందజేశారు. కుటుంబ పెద్దను కోల్పోయి దిక్కుతోచని పరిస్థితిలో ఉన్న ఆ ఇద్దరు ఆడపిల్లలకు "మేమున్నాం" అంటూ ముందుకు వచ్చి సహాయం చేయడం ఆదర్శనీయమని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తోటి మిత్రుల సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మొగిలి శ్రీనివాస్, సిల్వేరు ఉపేందర్,బెల్లంకొండ నగేష్, సంగిశెట్టి భాస్కర్,కంకల మల్లేష్, సంగిశెట్టి రమేష్,బెల్లంకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**తొలి అక్షరం :వలిగొండ, ఏప్రిల్ 06:** భారతీయ జనతా పార్టీ వర్కట్ పల్లి గ్రామంలో బూత్ నెంబర్స్ 225,226 అధ్యక్షులు మండలోజు రాజేశ్వర చారి, ఏర్పుల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండా ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొప్పుల యాది రెడ్డి గారు, వలిగొండ మండల ప్రధాన కార్యదర్శి లోడే లింగస్వామి గౌడ్ గారు, మాజీ మండలాధ్యక్షుడు నాగవెల్లి సుధాకర్ గౌడ్ గారు , పార్టీ నాయకులు గుర్రం కుమారస్వామి, ఎర్రగోని శ్రీనివాస్ యాదవ్, కాసోజు నాగరాజా చారి, నాగవెల్లి చిన్న సత్యనారాయణ గౌడ్, కంది బాల్ రెడ్డి ,నాగవెల్లి సందీప్ గౌడ్, మండలోజు రాంప్రసాద్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు..

# వలిగొండలోని సీతారామ చంద్రస్వామి పోస్టర్ ఆవిష్కరణ



**తొలి అక్షరం :వలిగొండ, ఏప్రిల్ 06:** సీతారామచంద్రస్వామి దేవస్థానంలో 10 11 12 మూడు రోజులు కార్యక్రమాలు పాంప్లెంట్ రిలీజ్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రామాలయ చైర్మన్ కుంభం విద్యాసాగర్ రెడ్డి గారు ఆధ్వర్యంలోప్రధాన కార్యదర్శి బచ్చు శ్రీనివాస్ గారు కోశాధికారి బుంగమట్ల కిష్టయ్య బత్తిని లింగయ్య ఉపాధ్యక్షులు ఆటిపాముల రవి గారు మైసొల్ల లక్ష్మీనరసు కమిటీ సభ్యులు పబ్బు సురేందర్ బత్తిని సత్యనారాయణ కంకణ కిష్టయ్య బత్తిని సహదేవ్ వార్డు మెంబరు మైసొల్ల రామ నర్సు కాసుల వెంకన్న ఏమ్మ మల్లేశం గంగ దారి దయాకర్ మైసొల్లా ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు..

# ఘనంగా న్యూ లయోలా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు

**విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని విజయం సాధించాలి**

**పాఠశాల కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్**







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ కుమార్ పల్లి మార్కెట్ ఏరియాలోని న్యూ లయోలా విద్యాసంస్థలో ఆనందోత్సాహాల మధ్య వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. అంబేద్కర్ భవన్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని,విద్యార్థుల రంగురంగుల సాంస్కృతిక ప్రదర్శనలతో కళకళలాడింది. విద్యార్థులు నృత్యాలు, పాటలు, నాటికలు, సాంప్రదాయ కళాప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరై పిల్లల ప్రతిభను అభినందించారు. ముందుగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు,పాఠశాల డైరెక్టర్,ప్రిన్సిపల్ లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్,ప్రిన్సిపల్ మాట్లాడుతూ...చాలా ఉత్సాహభరితంగా సాగిన కంగారూ కిడ్స్ స్కూల్ వార్షికోత్సవం విద్యార్థులకు మరపురాని జ్ఞాపకాలను అందించింది అని అన్నారు. విద్య అనేది భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. చదువుతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు ముందుండాలని సూచించారు. కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతి కుమార్ మాట్లాడుతూ...విద్యార్థుల ప్రతిభకు వేదికగా నిలిచిన అన్యువల్ డే వేడుకలు విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పలు సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించారని, ఈ కార్యక్రమంలో చిన్నారులు నృత్యాలు,పాటలు,నాటికలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విద్యార్థులను ప్రోత్సహించారని తెలిపారు. పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఈ అన్యువల్ డే కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈఅనంతరం విద్యార్థుల ప్రతిభను గుర్తిస్తూ స్కూల్ యాజమాన్యం మెరిట్ సాధించిన వారికి బహుమతులు అందజేసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్‌లో అశోక్ గౌడ్‌కు కీలక బాధ్యతలు

- **మహబూబాబాద్ జిల్లాకు ఉపాధ్యక్షుడిగా నియామకం**
- **పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్న అశోక్ గౌడ్**
- **నేతల నుండి శుభాకాంక్షల వెల్లువ**



**తొలి అక్షరం/ఇనుగుర్తి ఏప్రిల్ 6:** ఇనుగుర్తి మండల పరిధిలోని చిన్ననాగారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బైరు అశోక్ గౌడ్‌కు కీలక పదవి లభించింది. మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ సమన్వయకర్తగా, అలాగే నెల్లికుదురు మాజీ మండల అధ్యక్షుడిగా పనిచేసిన ఆయనను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు భూక్య ఉమా మురళి నాయక్ సోమవారం అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా అశోక్ గౌడ్ మాట్లాడుతూ, “నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు. జిల్లా అభివృద్ధి, పార్టీ బలోపేతం కోసం మరింత శ్రమిస్తాను. కార్యకర్తలందరితో కలిసి కాంగ్రెస్‌ను మరింత బలంగా నిలబెడతాను” అని తెలిపారు. అశోక్ గౌడ్ నియామకంపై పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఓబీసీ మండల అధ్యక్షుడు హరికృష్ణ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత పురోగమిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# అమెరికా యుద్ధోన్మాదంపై మోడీ మౌనం వీడాలి

**పార్లమెంటు సాక్షిగా అమిత్ షా పచ్చి అబద్దాలు**

**లొంగిపోయిన మావోయిస్టులపై ప్రభుత్వ నిర్బంధం**

**మాజీ మావోయిస్టులు బూర్జువా పార్టీలతో కలవద్దు**

**సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ**




**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిది:** భారత దేశానికి నష్టం కలిగిస్తున్న అమెరికా యుద్ధోన్మాదంపై ప్రధాని నరేంద్రమోడీ మౌనం వీడాలని సీపీఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె. నారాయణ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ కాంక్షతో అనేక దేశాలు ప్రభావితం అవుతున్నాయని,ఇంధన సరఫరాలో ఇక్కట్లతో పాటు భారతదేశంలోని రైతుల ఉత్పత్తులు,పండ్లు,కూరగాయలు,బియ్యం తదితర వస్తువుల ఎగుమతి నిలిచిపోయిందని అన్నారు. యుద్ధం ప్రభావంతో దేశంలో అన్ని రకాల ధరలు పెరిగిపోతున్నాయని,ప్రజల ఇక్కట్లను తొలగించి భారత దేశ ఔన్నత్యాన్ని కాపాడేందుకు,ట్రంప్ దుర్మార్గాన్ని ఆపేందుకు మోడీ మౌనం వీడాలని అన్నారు. మోడీ యుద్ధం పేరుతో దాడి చేస్తున్న దేశాలతో మాట్లాడకుండా యుద్ధం వల్ల నష్ట పోతున్న ఇరాన్ తో మాట్లాడడం దేశానికి అవమానకరమని అన్నారు. ఒకవైపు అమెరికాలోనే 50 రాష్ట్రాలలో ట్రంప్ కు వ్యతిరేకంగా లక్షలాది మంది నిరసనలు తెలుపుతుంటే మన దగ్గర అసమర్థ ప్రధానిగా మోడీ బలహీనంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇటీవల కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు సాక్షిగా అబద్దాలు వల్లే వేశారని, కమ్యూనిస్టులు,మావోయిస్టుల పట్ల తన అక్కసును వెల్లగక్కారని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో సీపీఐ పాల్గొని అనేక త్యాగాలు చేసిందని,ఆనాడు బీజేపీ,ఆర్ఎస్ఎస్ లు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదని అన్నారు. నక్సలైట్ ఉద్యమం నుండి విడిపడి బయటికి వచ్చిన గద్దర్ ను అమిత్ షా నక్సలైట్ అన్నారని,మరి అదే గద్దర్ చనిపోతే ప్రధాని మోడీ సంతాపం ఎందుకు వ్యక్తం చేశారని నారాయణ ప్రశ్నించారు. గద్దర్ చనిపోతే సంతాపం తెలిపి నందుకు ప్రధాని మోడీని దమ్ముంటే అరెస్టు చేస్తారా అని,లేదా అసత్యాలు పలికిన అమిత్ షా పై కేసు పెడతారా అని ప్రశ్నించారు. హత్యానేరం మోపబడిన అమిత్ షా 12 మందిని చంపించి నిర్దోషినిగా ప్రకటించుకున్న చరిత్ర ఉందన్నారు. నక్సలైట్లను జన జీవన స్రవంతిలో కలవాలని మొదట కోరింది తామేనని,ఆపరేషన్ కగార్ నిలిపివేసి ఇరు వర్గాలు కాల్పుల విరమణ పాటించాలని తామే సూచించామని అన్నారు. కానీ కేంద్రం అమానుషంగా వ్యవహరించి బయటికి వచ్చిన హిడ్మా లాంటి నక్సలైట్లను వందల మందిని ఎన్ కౌంటర్ చేయించిందని ఆరోపించారు. లొంగిపోయిన మావోయిస్టులకు కూడా ప్రభుత్వం సరైన గౌరవం ఇవ్వడం లేదని, మావోయిస్టులు ఎవరితో మాట్లాడవద్దని నిబంధనలు పెడుతున్నారని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి వస్తామని చెప్పిన మావోయిస్టు నాయకులు పోలీసుల ఒత్తిడితోనే రాలేదని అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు సరైన స్వేచ్ఛ, గౌరవం ఇవ్వడం లేదని అన్నారు. మావోయిస్టులు ఇప్పటికైనా స్వేచ్ఛగా,గౌరవంగా బతుకాలని,ప్రజాస్వామ్య బద్ధంగా సీపీఐ వారికి అండగా ఉంటుందని చెప్పారు. 40 ఏండ్ల పాటు వారు జీవితాలను త్యాగం చేశారని, అలాంటి వారు బూర్జువా పార్టీలతో కలువ వద్దని,వారంతా వామపక్ష ఉద్యమంలో భాగం కావాలని కోరారు. కాగా ఇటీవల క్రిష్టియన్ మతంలో చేరితే ఎస్సీ కులం హోదా రద్దు అవుతుందని వచ్చిన తీర్పు సరికాదని, ఏ మతంలో చేరినా మనిషి కులం ఎన్నటికీ మారదని, క్రిష్టియన్ మతంలో చేరినా ఎస్సీ హోదా రద్దు కాదని అన్నారు. కేంద్రం చేపట్టిన ఎస్ఐఆర్ ను తాము వ్యతిరేకిస్తున్నామని,దేశంలో ఫెడరల్ వ్యవస్థను ధ్వంసం చేసేందుకే కేంద్రం రాష్ట్రాలపై ఎస్ఐఆర్ ను ప్రయోగిస్తున్నదని అన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ల పల్లి శ్రీనివాసరావు,హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్,జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి,సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి,ఎన్ ఎ స్టాలిన్,మునిగాల బిక్షపతి,ఎదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి,యెశబోయిన శ్రీనివాస్,కొట్టేపాక రవి,బత్తిని సదానందం పాల్గొన్నారు.

# అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇనుగుర్తిలో చలివేంద్రం ప్రారంభం

- **ఎస్సై గంగారపు కరుణాకర్ చేతుల మీదుగా ప్రారంభం**
- **సర్పంచి తమ్మడపల్లి కుమార్, డా. రవీందర్ సమక్షంలో**
- **ప్రశాంత్, రఘు, లక్ష్మయ్యల చొరవతో ఏర్పాటు**





**తొలి అక్షరం/ఇనుగుర్తి ఏప్రిల్ 6:** మహబూబాబాద్ జిల్లా: మండల కేంద్రం ఇనుగుర్తిలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఫౌండేషన్ సభ్యులు చిన్నాల ప్రశాంత్, చెడుపాక రఘు, గుజ్జునూరి లక్ష్మయ్యల చొరవతో ఈ సేవా కేంద్రం ఏర్పాటైంది. కార్యక్రమాన్ని స్థానిక ఎస్సై గంగారపు కరుణాకర్ చేతుల మీదుగా, సర్పంచి తమ్మడపల్లి కుమార్, వెటర్నరీ డాక్టర్ రవీందర్ సమక్షంలో ప్రారంభించారు. ఎస్సై గంగారపు కరుణాకర్ మాట్లాడుతూ:అక్షయపాత్ర ఫౌండేషన్ సమాజ సేవలో ముందుండి పనిచేస్తోందని, ఎండల సమయంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం వారి సేవా నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. ప్రజల అవసరాలను గుర్తించి ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిన్నల కటయ్య, నదునూరి ప్రశాంత్, దొడ్డ రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జన్మదినం.....

# మెగా రక్తదాన శిబిరం

**ఉమ్మడి కొందుర్గు మండలంలో రక్తదాన శిబిరం**

**అధిక సంఖ్యలో రక్తదానం చేసిన అభిమానులు**

**మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం**

**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 06:** ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి జన్మదిన శుభ సందర్భంగా మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి కొందుర్గు మండలంలో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయబడింది. తమ అభిమాన నాయకుని జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేయబడిన రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొని రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారుగా 70 మంది అభిమానులు రక్తదానం చేసినట్లు తెలియజేశారు. అభిమాన నాయకుని పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేయబడిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం వలన మరికొందరు జీవితాల్లో వెలుగులు నిండడం తమకి ఎంతో సంతోషాన్ని ఇస్తుందని, చాలా అత్యవసర పరిస్థితులలో రక్తం యొక్క అవసరం ఉంటుందని, అలాంటి వారికి తమ నాయకుని పుట్టినరోజు వేదిక కావడం తమకు ఎంతో సంతోషంగా ఉందని అభిమాన రక్త దాతలు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేయబడిన రక్తదాన శిబిరానికి అభిమానులు అత్యధిక సంఖ్యలో హాజరై రక్తదానం చేయడం పట్ల మహాదేవపూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి సంతోషం వ్యక్తపరుస్తూ కార్యక్రమం విజయవంతమైనందుకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.





# శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రథమ బ్రహ్మోత్సవ వేడుకలు

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** హనుమకొండ విద్యుత్ నగర్ లోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ప్రథమ బ్రహ్మోత్సవ వేడుకలు ఏప్రిల్ 06 వ తేదీ సోమవారం నుంచి ఏప్రిల్ 11 వ తేదీ శనివారం వరకు నిర్వహించబడతాయని దేవాలయ నిర్వహణ కమిటీ తెలిపారు. మొదటి రోజైనా ఏప్రిల్ 06 వ తేదీ సోమవారం సాయంత్రం బ్రహ్మోత్సవ అంకురారోపణము నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 6 గంటలకు సమిష్టి శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణము,పెంచుకున్న మంగళవాద్య వేద స్వస్తి వచనములు యాగశాల ప్రవేశం,శ్రీ విశ్వక్సేనారాదనము,పుణ్యాహవాచనము తదితర కార్యక్రమాలకు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్షులు నల్ల రాంరెడ్డి ప్రధాన కార్యదర్శి పోలేపల్లి ఇంద్రసేనారెడ్డి కోశాధికారి మాదంశెట్టి శివకుమార్ లు మాట్లాడుతూ... ఆ వెంకటేశులు మనల్ని అనుగ్రహించడానికి ఆ ఏడుకొండల నుండి విద్యుత్ నగర్ హనుమకొండకు శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి దివ్య వరముల ద్వారా శ్రీ విశ్వాసి నామ సంవత్సర చైత్ర బహుళ సప్తమి ఆదివారం ఉత్తరాషాడ నక్షత్ర యుక్త వృషభ లగ్నమున ప్రతిష్ఠించబడి ప్రథమ బ్రహ్మోత్సవము సందర్భముగా భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతు కైంకర్యాన్ని సమర్పించి భగవత్ భాగవత ఆచార్యుల కృపా కటాక్షములకు పాత్రులై తరించ గలరని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా అమ్మవారికి వెండి కిరీటం,ధ్వజ స్తంభానికి ఇత్తడి తొడుగు తాపడం, ఆలయం చుట్టూ రేకుల షెడ్డు నిర్మాణం చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. శ్రీ స్వామివారి బ్రహ్మోత్సవ కార్యక్రమము లు ఏప్రిల్ 06 సోమవారం సా. బ్రహ్మోత్సవ అంకురారోపణము,ఏప్రిల్ 07 మంగళవారం ఉ. అగ్నిప్రతిష్ఠ, ధ్వజారోహణము, గరుడబలి సా. భేరీతాడనము, దేవతాహ్వానము, రా. శేషవాహనసేవ ఏప్రిల్ 08 బుధవారం ఉ. హోమం, బలిహరణం, రా. హనుమ ద్వాహనసేవ ఏప్రిల్ 09 గురువారం ఉ.శ్రీవేం కటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవము రా. గరుడవాహనసేవ ఏప్రిల్ 10 శుక్రవారం ఉ. హోమం,బలిహరణం, రా. ఊంజల్ సేవ ఏప్రిల్ 11 శనివారం ఉ. మహాపూర్ణాహుతి సా. శ్రీపుష్పయాగము, ద్వాదశారాధనలు,సప్తావరణము,ఉత్సవసమాప్తి అని తెలిపారు.





# ఇసుక అక్రమార్కులపై 'ఖైదీ' ఉచ్చు: వాగులో ఖాకీల మెరుపు దాడి!

**ఆకేరు తీరంలో అక్రమ రవాణాకు బ్రేక్.. 10 మందికి బైండోవర్.**


**రూ. 2 లక్షల పూచీకత్తు.. నిబంధనలు మీరితే కఠిన చర్యలు.**

**తహశీల్దార్ సమక్షంలో యజమానులు, డ్రైవర్ల హాజరు.**



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ ఏప్రిల్ 6:** నెల్లికుదురు,ప్రకృతి సంపదను కొల్లగొడుతూ, అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న అక్రమార్కులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి శివారులోని ఆకేరు వాగు వేదికగా సాగుతున్న ఇసుక దందాను పోలీసులు అడ్డుకున్నారు. సోమవారం తెల్లవారుజామున ఎస్సై చిర్ర రమేష్ బాబు నేతృత్వంలో నిర్వహించిన మెరుపు దాడిలో 10 ఖాళీ ట్రాక్టర్లు పట్టుబడగా, వాటి యజమానులు, డ్రైవర్లపై కఠిన చర్యలు చేపట్టారు. **వాగులో తనిఖీలు.. నిందితుల గుర్తింపు:** నమ్మదగిన సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో కలిసి ఆకేరు వాగు రీచ్ వద్దకు వెళ్లగా, ఇసుక లోడింగ్ కోసం సిద్ధంగా ఉన్న 10 ఖాళీ ట్రాక్టర్లు కనిపించాయి. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలింపునకు యత్నిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, వాహనాలతో పాటు డ్రైవర్లను, యజమానులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **భారీ జరిమానా.. కఠిన హెచ్చరికలు:** పట్టుబడిన వారిని సోమవారం స్థానిక తహశీల్దార్ చందా నరేష్ ముందు హాజరుపరిచారు. ఈ సందర్భంగా నిందితులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. "ఇకముందు ప్రభుత్వ అనుమతి లేకుండా వాగులోకి ప్రవేశిస్తే ఒక్కొక్కరు రూ. 2 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది" అని తహశీల్దార్ స్పష్టం చేశారు. అనంతరం వాహనాల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు, నిబంధనల ఉల్లంఘన కింద ఈ-చలాన్ల ద్వారా భారీ జరిమానాలు విధించారు. **ఉపేక్షించేది లేదు - ఎస్సై రమేష్ బాబు:** ఈ సందర్భంగా ఎస్సై రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అక్రమ రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామని, ప్రకృతి వనరులను కాపాడటంలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ ఆకస్మిక దాడితో మండలంలోని ఇసుక మాఫియా ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శిగా దాసరోజు రాజశేఖర్ నియామకం




**తొలిఅక్షరం/ నర్సింహులపేట ఏప్రిల్ 6 :** మహబూబాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా నర్సిశీహుల పేట మండలం కొమ్ములవంచ గ్రామానికి చెందిన దాస రోజు రాజశేఖర్ ను తెలంగాణ పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ సోమవారం నియమించడం జరిగింది.తన నియామకానికి సహకరించిన డోర్నకల్ ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ డా.రామచంద్రనాయక్ కు ఆయన కృతజ్ఞత తెలియజేశారు. ఇప్పటినుండి తనకు మరింత బాధ్యత పెరిగిందని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతంచెందడానికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు

# భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం



**తొలి అక్షరం/రామన్నపేట ఏప్రిల్ 6:** రామన్నపేట పట్టణ కేంద్రంలో సూరారం గ్రామంలో భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి బిజెపి మండల అధ్యక్షులు బండ మధుకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది కార్యక్రమంలో బిజెపి నకిరేకల్ నియోజకవర్గం ఇన్చార్జి నకరకంటి మొగులయ్య పాల్గొని రామన్నపేటలో జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది అలాగే సూరారంలో మండల అధ్యక్షుడు బండ మధుకర్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది అనంతరం వారు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 ఏప్రిల్ ఆరో తారీఖున ఆవిర్భవించడం జరిగింది అప్పటి జాతి అధ్యక్షులు మాన్యశ్రీ అటల్ బీహార్ వాజ్ పేయ్ పర్యటించి పార్టీ అభివృద్ధి కోసం పని చేయడం జరిగింది దేశంలో పార్టీ విస్తరణ కోసం లాల్ కృష్ణ అద్వాని విస్తృతంగా దేశ పర్యటన చేసి రథయాత్రలు నిర్వహించి దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరించేందుకు కృషి చేయడం జరిగింది ప్రస్తుతం దేశంలో అత్యధిక మెజార్టీతో భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి రావడం జరిగింది కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం స్థిరమైన మరియు సమర్థవంతమైన పరిపాలన సాగిస్తూ మచ్చలేని నాయకుడిగా నరేంద్ర మోడీ పేరు ప్రతిష్టలు తీసుకురావడం కోసం జరిగింది దేశంలో ఆర్థిక పరిస్థితిని బలోపేతం చేస్తూ ప్రపంచ దేశాలతో అభివృద్ధి పథంలో ముందుకు పోతూ ప్రపంచ దేశాలలో పోటీ పడుతుంది అందులో భాగంగా భారతదేశంలో అతి పెద్ద పార్టీగా బిజెపిని ఆవిర్భవించి పార్టీ అభివృద్ధికి భారతీయ జనతా పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలు సైనికులుగా నిలబడి పార్టీ నీ గెలిపించాలని కోరారు అలాగే సూరారం గ్రామంలో భారతీయ జనతా పార్టీలోకి పెద్ద ఎత్తున యువత చేరిక కావడం జరిగింది ఈ కార్యక్రమంలోజిల్లా కార్యదర్శి తాటిపాముల శివకృష్ణ బీజేపీ జిల్లా నాయకులు దోగుపర్తి సుభాష్ మద్దూరి ప్రభాకర్ రావు కట్ట యాదయ్య గోపగోని ధర్మరాజు బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు పల్లపు దుర్గయ్య యువ మోర్చా జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి సైదులు మండల ప్రధాన కార్యదర్శిలు . జంగిలి. సత్యనారాయణ బెజ్జంకి శివకుమార్ చారి ఉపాధ్యక్షులు కంభంపట్టి శివరంజన్ బట్టే రమేష్ కోశాధికారి గురుకు జ్యోతి కార్యదర్శులు రేపాక లింగస్వామి బందెల సంజీవ బతుక నరేష్ కార్యవర్గ సభ్యులు కన్నెబోయిన నరేష్ కేసీడీ నవీన్ సీనియర్ నాయకులు గట్కు శ్రీను మద్దెలపూరి ఐలయ్య గురుకు సైదులు నకిరేకంటి శ్రీను సుర్వి హరిబాబు రేపక యాదయ్య శక్తి కేంద్రం ఇంచార్జులు బోనగిరి వెంకటేశం మచ్చ మహేష్ బెల్లి లింగస్వామి ఎన్నం భాస్కర్ యెన్నం రాజు బాత్క సైదులు డాకోజి నాగరాజు కంచి రమేష్ తిరుమల మల్లేష్ మోటే సుదీర్ చిన్నపాక స్వామి దావునూరి అజయ్ అవుల నర్సింగ్ ,దోమల గణేష్, కేసీడీ నవీన్, మునుకుంట్ల వెంకన్న, కొత్తోజు సాయి, బందెల పవన్, గోసుల మధు, దోమల నాగరాజు, దంతాల నవీన్, బకతట్ల పరిశీ, జినుకల మచ్చగిరి, పొలబోయిన కార్తీక్, పొలబోయిన కరుణాకర్, పోలవేన నరేష్, భూమ మచ్చ గిరి, జినుకల నరేష్, దంతాల శివ, దాసరి నాగరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్ట్ కేపీ మరింత ఉన్నతికి ఎదగాలి: మాజీ జెడ్పిటిసి విశాల, శ్రవణ్ రెడ్డి



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 06:** జర్నలిస్టుగా, సేవకుడిగా, కళాకారుడిగా భిన్న పాత్రలు పోషిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదుగుతున్న జర్నలిస్టు కేపీ మరింత ఉన్నతికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నామని మాజీ జెడ్పిటిసి తాంద్ర విశాల, శ్రవణ్ రెడ్డి దంపతులు అన్నారు. జర్నలిస్టు కేపీ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయనను కలుసుకుని స్వీట్లు తినిపించి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాకారుడిగా ఒకవైపు కళాప్రియులకు ఆనందాలు పంచుతూనే మరోవైపు జర్నలిస్టుగా సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్న జర్నలిస్టు కేపీ ఎప్పుడూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. కళా పీఠం ద్వారా ఒక అద్భుతమైన పాటల కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అందరి మన్ననలను పొందాలని ప్రశ్నించారు.

# నాడు మాట ఇచ్చాడు... నేడు నెరవేర్చాడు


**ముగ్గురు ఆడబిడ్డల కుటుంబాలకు రూ.5,000 చొప్పున సహాయం**

**సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ ఆదర్శ నిర్ణయం**




**తొలి అక్షరం/నందిగామ,ఏప్రిల్ 06:** గ్రామ అభివృద్ధి, సామాజిక బాధ్యతల విషయంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం అరుదుగా కనిపించే విషయం.అయితే అలాంటి అరుదైన ఉదాహరణగా నిలిచారు. మోత్కుల గూడా గ్రామ సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ . సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామ ప్రజల ముందుకు వచ్చి, గ్రామంలో ఆడబిడ్డ పుడితే ప్రతి కుటుంబానికి రూ. 5,000 ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు.ఆ హామీని కేవలం మాటలకే పరిమితం చేయకుండా గెలుపొందిన తర్వాత కూడా తన బాధ్యతగా తీసుకున్నారు.ఇటీవల గ్రామంలో ముగ్గురు కుటుంబాల్లో ఆడబిడ్డలు జన్మించాయి.ఈ సందర్భంగా సర్పంచ్ జెట్ట లావణ్య రమేష్ స్వయంగా ఆ కుటుంబాలను కలుసుకుని, ఒక్కో కుటుంబానికి రూ 5,000 చొప్పున మొత్తం రూ 15,000లను అందజేశారు. ఈ చర్యతో గ్రామ ప్రజల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ...ఆడబిడ్డలు కుటుంబానికి ఆనందం, సమాజానికి ఆశ. వారి పుట్టుకను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత.ఆడబిడ్డల ప్రోత్సాహానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు.గ్రామంలో ఆడబిడ్డల పట్ల సానుకూల దృక్పథాన్ని పెంపొందించే ఈ నిర్ణయం ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు అభిప్రాయపడుతున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నరసింహులు, వార్డు మెంబర్స్, లక్ష్మమ్మ, జెట్ట నాగేష్,జెట్ట సంతోషం, వానరసి లక్ష్మమ్మ,బి రమేష్,ఎ శైలజ, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఖాకీ వెనుక కన్నీటి కావ్యం.. 'యూనిఫాం' వెనుక యుద్ధం!




ప్రజలు చూసేది కేవలం ఆ గంభీరమైన పోలీస్'ని మాత్రమే.. కానీ ఆ ఖాకీ చొక్కా మాటున దాగున్న సున్నితమైన 'మనిషి' ఎవరికీ కనపడదు. సమాజం నిద్రపో వడానికి తను నిద్రను త్యాగం చేసే యోధుడు అతను.నిదుర అతనికి హక్కు కాదు.. కర్తవ్య పిలుపు వస్తే అలసట అవసరం కాదు.సగం తిన్న కంచం ముందున్నా, నిదుర కళ్లలో కునుకు ఉన్నా..ఒక్క ఫోన్ కాల్ చాలు.. శాంతిభద్రతల కోసం అతని పరుగు మొదలవుతుంది!కుటుంబం.. అందని ద్రాక్షే! పదిమందికి పండుగలు సంబరాలైతే, అతనికి అవి పని గంటల లెక్కలు.బిడ్డల పుట్టినరోజులు క్యాలెండర్ లో తేదీలు మాత్రమే..మనసులో ఎన్నెన్నో బాధలున్నా, ముఖంపై కఠినత్వం తప్పదు.కళ్లలో కన్నీళ్లు సుడులు తిరుగుతున్నా.. కనురెప్ప దాటి బయటకు రావు!తిరుగు ప్రయాణం లేని పయనమా? ఇంటి నుంచి వీధిలోకి అడుగుపెట్టినప్పుడు, సురక్షితంగా తిరిగి వస్తానో లేదో తెలియని అనిశ్చితి.చిన్న తప్పు దొర్లితే విమర్శల వెల్లువ..నిజాయితీగా పనిచేసినా ప్రశంసల జాడ కరువు!ఒంటరి యుద్ధం.. నిరంతర త్యాగం! శరీరం అలసిపోయి విరామం కోరుతున్నా.. విధి అతన్ని ఆపదు.చుట్టూ జనం ఉన్నా, తన గోడు వినేవారు లేక లోలోన మథనపడే ఏకాకి అతను.పోలీసు అంటే కేవలం ఒక 'ఉద్యోగం' కాదు..అదొక నిరంతర యుద్ధం.. అంతులేని త్యాగం!మన కోసం నిలబడే ఆ యోధుడికి.. మనం ఇవ్వా ల్సింది ఒక్కటే.. 'గౌరవం'. అతని బాధ్యతను అర్థం చేసుకుం దాం.. సమాజ రక్షణలో ఆ ఖాకీకి అండగా నిలుద్దాం!



**- తాడూరి సంపత్, సీనియర్ జర్నలిస్ట్**

# కుంగ్ ఫు విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్‌లు ప్రదానం

- ముఖ్య అతిధులుగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మాజీ జడ్పీటీసీ తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎస్సై రాంచంద్రయ్య




**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 06:** షాద్ నగర్ పట్టణం లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ బాలరాజ్, మాస్టర్ అహ్మద్ ఖాన్ (బ్రుస్లీ ) అధ్వర్యంలో కుంగ్ ఫు విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్ లు ప్రదానం చేశారు. ఇందులో కుంగ్ ఫు విద్యార్థులు తమ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బెల్టులు, సర్టిఫికెట్ లు సొంతం చేసుకున్నారు. ఇందులో న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ కు చెందిన ప్రేమ్ కుమార్ మరియు నిఖిత్ గౌడ్ అద్భుతమైన ప్రదర్శన కనబర్చి బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకున్నారు. బెల్టులు, సర్టిఫికెట్ లు గెలుపొందిన విద్యార్థులకు ముఖ్య అతిధులుగా విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కేశంపేట మాజీ జడ్పీటీసీ తాంద్ర విశాల శ్రావణ్ రెడ్డి, షాద్ నగర్ పట్టణ ఎస్సై రాంచంద్రయ్య చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి కాలంలో ఆడపిల్లల కు రక్షణ లేదని దాని కొరకు ప్రతి ఒక్కరు కుంగ్ ఫు, కరాటే లాంటి విద్యను నేర్చుకోవాలని అన్నారు. ఆత్మరక్షనే కాకుండా దేహాదారుద్యానికి ఈ విద్య ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు.కార్యక్రమం లో మాస్టర్స్ బాలరాజ్, అహ్మద్ ఖాన్ (బ్రుస్లీ ),యువసత్తా లక్ష్మణ్ కుమార్,విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.




# ఆత్మీయ నేస్తమా.. అందుకో శుభాకాంక్షలు..

**జర్నలిస్టు కేపీని కలిసిన సినీ నటుడు టార్జాన్**

**జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన టార్జాన్**



**తొలి అక్షరం/షాద్ నగర్, ఏప్రిల్ 06:** ఆత్మీయ నేస్తమా.. అందుకో శుభాకాంక్షలు.. అంటూ ప్రముఖ టాలీవుడ్ నటుడు టార్జాన్ (లక్ష్మీనారాయణ) జర్నలిస్ట్ కేపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. జర్నలిస్ట్ కేపీ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం కేపీ స్వగృహంలో ఆయనను కలుసుకు న్నారు. జర్నలిస్టుగా తన ప్రయాణం మొదలుపెట్టి సేవకుడిగా, కళాకారుడిగా ఎవరికీ అందనంత ఎత్తుకు కేపీ ఎదిగారని ఆయన ప్రశంసించారు. ఇలాంటి వ్యక్తి తనకు స్నేహితుడు కావడం గర్వకారణం అని పేర్కొన్నారు. ఆయన కుటుంబం ఎప్పుడు సుఖ సంతోషాలతో ఉండాలని టార్జాన్ ఆకాంక్షించారు. పూలమాలలతో, శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# గాయపడ్డ సింహం.. ఓ మంచి పాత్రలో కనిపిస్తా

## నటుడు జెడి చక్రవర్తి



కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.

# వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?




మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# 15 ఏళ్లకే ఆ నరకం చూశాను

## : డీప్‌ఫేక్ ఫొటోలపై జాన్వీ కపూర్



టాలీవుడ్, బాలీవుడ్‌లో వరుస ప్రాజెక్టులతో దూసుకుపోతున్న నటి జాన్వీ కపూర్, తన టీనేజ్ రోజుల్లో ఎదురైన ఒక చేదు అనుభవాన్ని పంచుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన జాన్వీ, టెక్నాలజీ దుర్వినియోగం వల్ల తాను ఎదుర్కొన్న మానసిక వేదనను బయటపెట్టింది.

స్కూల్ రోజుల్లో జాన్వీకి కేవలం 15 ఏళ్లు ఉన్నప్పుడు, ఆమె ఫొటోను సాంకేతికతతో అసభ్యకరంగా మార్చి ఒక అశ్లీల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశారు. తన స్నేహితురాలు ఆ ఫొటోను చూపించే వరకు తనకు విషయం తెలియదని, అది చూసి ఏం చేయాలో పాలుపోక ఎంతో ఏడ్చానని ఆమె ఎమోషనల్ అయింది. సోషల్ మీడియాలో నైతికత ఉండదని ఆ చిన్న వయసులోనే తనకు అర్థమైందని, భవిష్యత్తులో ఇలాంటివి ఎదుర్కోవడానికి అప్పుడే మానసిక ధైర్యాన్ని పెంచుకున్నానని తెలిపింది.

ఇప్పుడు తనపై వచ్చే నెగటివ్ కామెంట్లను లేదా మార్ఫింగ్ ఫోటోలను పెద్దగా పట్టించుకోనని జాన్వీ స్పష్టం చేసింది. టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ ఇలాంటి సవాళ్లు తప్పవని, వాటిని ధైర్యంగా ఎదుర్కోవడమే మార్గమని ఆమె యువతకు సూచించింది. కెరీర్ విషయానికి వస్తే... 'దేవర' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన జాన్వీ, ప్రస్తుతం రామ్ చరణ్ సరసన 'పెద్ది' సినిమాలో నటిస్తోంది. వీటితో పాటు మరికొన్ని క్రేజీ ప్రాజెక్టులతో ఆమె బిజీగా ఉంది.




# రాకాసకు మంచి ఓపెనింగ్స్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్టాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్టాటజ్రీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి.ఇప్పటికే నిర్మాతగా 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, సపోర్టింగ్ క్యాస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలిసి సినిమాకు మంచి ప్లస్ అయ్యాయి. ముఖ్యంగా హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'రాకాస' సినిమా బాక్సాఫీస్ వద్ద మంచి జోరు చూపిస్తూ, నిహారిక కొణిదెలను విజయవంతమైన నిర్మాతగా మరోసారి నిలబెడుతోంది.

# అనిల్ రావిపూడికి దిల్ రాజు బంపర్ ఆఫర్!


తన తదుపరి మల్టీస్టారర్ సినిమా హీరోయిన్ ఎంపికపై వస్తున్న ఊహాగానాలకు ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరదించారు. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ హీరోలుగా తాను తెరకెక్కిస్తున్న చిత్రంలో కృతిశెట్టిని ఓ కథానాయికగా తీసుకున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో కొన్ని రోజులుగా మీడియాలో వస్తున్న కథనాలకు స్పష్టత లభించినట్లయింది.

ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నిర్మాత దిల్ రాజు, దర్శకుడు అనిల్ రావిపూడి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా దిల్ రాజు మాట్లాడుతూ, అనిల్ రావిపూడిలో మంచి నటుడు ఉన్నాడని, అవకాశం వస్తే తానే హీరోగా పరిచయం చేస్తానని అన్నారు.దిల్ రాజు ఆఫర్‌పై అనిల్ రావిపూడి స్పందిస్తూ.. "దిల్ రాజు గారి ఆఫర్ బాగుంది. కానీ, ఇప్పట్లో నటించే ఆలోచన లేదు. ఆయన నిర్మాతగా ప్రదీప్ హీరోగా సినిమా తీస్తే నేను డైరెక్ట్ చేస్తాను" అని చమత్కరించారు. ఇదే వేదికపై తన కొత్త సినిమా హీరోయిన్‌పై స్పష్టత ఇచ్చారు. "మా సినిమాలో కృతిశెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ విషయంపై ఇప్పటికే చాలా రూమర్లు వచ్చాయి. వాటన్నింటికీ ఇప్పుడు చెక్ పెడుతున్నా" అని తెలిపారు.'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' హీరో ప్రదీప్ రంగనాథన్‌ను అనిల్ రావిపూడి ప్రశంసించారు. ప్రదీప్ హీరోలా కాకుండా మనలో ఒకడిలా ఉంటాడని, అందుకే ప్రేక్షకులు ఆయనను అంతగా ఆదరిస్తున్నారని కొనియాడారు. కాగా, 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం ఏప్రిల్ 10న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది.





# పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ



రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది.ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది.